అట్టహాసంగా ద్వారకనాథరెడ్డి నామినేషన్

- ఆరు మండలాల నుంచి తరలివచ్చిన ప్రజలు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు
- దారిపొడవునా ప్రజల నుంచి ఘనస్వాగతం
- జనంతో నిండిపోయిన తంబళ్లపల్లె రోడ్లు



గజమాలతో పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డికి స్వాగతం



తంబళ్లపల్లెలో పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి ర్యాలీ

బి.కొత్తకోట : వైఎస్సార్‌సీపీ తంబళ్లపల్లె అభ్యర్థిగా బరిలో నిలుస్తున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి నామినేషన్ సందర్భంగా గురువారం తంబళ్లపల్లె జన ప్రభంజనం అయ్యింది. పల్లెపల్లె నుంచి అభిమానులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు భారీసంఖ్యలో తరలివచ్చి అభిమానం చాటుకున్నారు. విజయోస్తు అంటూ తంబళ్లపల్లె ప్రజలు పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డిని ఆశీర్వదించగా తమ అభిమాన నేత కోసం వచ్చిన జనం తహసీల్దార్ కార్యాలయం వద్ద గంటకుపైగా మండుటెండను లెక్క చేయకుండా రోడ్డుపై నిలుచున్నారు. పోలీసులు అక్కడినుంచి వెళ్లిపోవాలని నెట్టేసినా కదల్లేదు. తహసీల్దార్ కార్యాలయం ఆవరణలోకి వచ్చిన పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి కొద్దిసేపు సేద తీరాక నిర్ణయించిన సమయానికి నామినేషన్ల దాఖలుకు ప్రతిపాదకులు పాగొండ ఖలీల్, పప్పు వెంకటరెడ్డిలతో కలిసి ఎన్నికల అధికారి కార్యాలయంలోకి వెళ్లారు. అక్కడ ఈఆర్‌ఓ రాఘవేంద్ర సమక్షంలో నామినేషన్ల దాఖలు, ప్రమాణపత్రం చదవడం, వాటి పరిశీలన పూర్తయ్యాక మధ్యాహ్నం 12.30గంటలకు బయటకు వచ్చారు. అంతవరకు కార్యాలయం ఎదుట మండుటెండలో ఆయన కోసం ఎదురుచూస్తున్న అభిమానులు ఒక్కసారిగా ఆయనపైకి దూసుకొచ్చారు. కరచాలనం చేసేందుకు పోటీ పడ్డారు. అభిమానులు ఆయన్ను భుజాలపైకి ఎత్తుకుని అభిమానం చాటుకున్నారు. తనకోసం వచ్చిన వారందరితో ఎమ్మెల్యే మాట్లాడారు.

దారి పొడవునా ఘనస్వాగతం

పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి స్వగ్రామం యర్రాతివారిపల్లె నుంచి వాయల్పాడు మీదుగా గుర్రంకొండకు వచ్చారు. అక్కడినుంచి తంబళ్లపల్లె మండలంలోని కుక్కరాజుపల్లెకు చేరుకోగానే అభిమానులు భారీ స్వాగతం పలికారు. కోటకొండ, దండువారిపల్లె, మఠం, ఎద్దులవారిపల్లె, ఎర్రసానిపల్లె, రామిగానిపల్లె, బూదలవారిపల్లె మీదుగా తంబళ్లపల్లె తహసీల్దార్ కార్యాలయం చేరుకున్నారు. ఈ మార్గంలోని ప్రతిపల్లె వద్ద ఎమ్మెల్యేకు ఘనస్వాగతం పలికిన పార్టీ శ్రేణులు, ప్రజలు ఆయనవెంట సాగారు.

మండుటెండలో ర్యాలీ

తహసీల్దార్ కార్యాలయం వద్ద నుంచి అభిమానులతో ర్యాలీ మొదలైంది. తీవ్రంగా మండుతున్న ఎండలను లెక్కచేయకుండా ప్రజలు ఎమ్మెల్యే వెంట ర్యాలీలో పాల్గొన్నారు. జై జగన్, జై ద్వారకన్న నినాదాలతో హోరెత్తించారు.

పూజలు చేసిన ఎమ్మెల్యే

సదుం(చిత్తూరు జిల్లా) : తంబళ్లపల్లె నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా నామినేషన్ వేయడానికి బయలుదేరే ముందు ఎర్రాతివారిపల్లెలోని ఆలయాల్లో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ రెడ్డి గురువారం పూజలు చేశారు. సదుమమ్మ ఆలయం, అయ్యప్ప ఆలయాల్లో పూజలు చేసి బయలు దేరారు. పూజల్లో రెడ్డి ఈశ్వర్ రెడ్డి, వెంకట రెడ్డి, పెద్దిరెడ్డి వేణుగోపాల్ రెడ్డి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

డీఎంకు ప్రశంసాపత్రం అందజేత



మదనపల్లె సిటీ : శబరిమలైకు ప్రత్యేక బస్సులు అధికంగా నడిపినందుకు మదనపల్లె ఆర్టీసీ-1 డీఎం మూరే వెంకటరమణారెడ్డికి జిల్లా ప్రజారవాణాధికారి రాము ప్రశంసాపత్రం, క్యాష్ అవార్డు అందజేశారు. రాయచోటిలో గురువారం జరిగిన కార్యక్రమంలో డీఎంకు ప్రశంసాపత్రం అందించారు. రాష్ట్ర వ్యాప్తంగా శబరిమలైకు అధిక సర్వీసులు నడిపారు. ప్రత్యేక బస్సు సర్వీసులు నడపడంతో పాటు డిపోకు ఆదాయం తీసుకువచ్చినందుకు ఆర్టీసీ ఎండి ద్వారక తిరుమలరావు ప్రశంసాపత్రం పంపారు. డీఎంను ఈడీతో పాటు సిబ్బంది అభినందించారు.

ఏపీఎస్పీడీసీఎల్ ఈఈగా యుగంధర్

మదనపల్లె : ఏపీఎస్పీడీసీఎల్ మదనపల్లె డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా డి.యుగంధర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో మదనపల్లె ఈఈగా విధులు నిర్వహిస్తున్న యుగంధర్... 2014లో విజయవాడలో ఏసీబీ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న నేపథ్యంలో మార్చి 22న బాధ్యతల నుంచి తప్పించారు. ఆరోపణలు రుజువు కాకపోవడంతో కోర్టు ఉత్తర్వుల మేరకు గురువారం ఆయన తిరిగి మదనపల్లె ఈఈగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా డివిజన్‌లోని ఏఈలు, లైన్‌మెన్‌లు, జూనియర్ లైన్‌మెన్‌లు ఆయనకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఏఈ నరసింహారెడ్డి, ఓసీ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ శేషాద్రినాగరాజు, ఎస్.రఘు, జే.శ్రీనివాసులు, పర్వతాల రాజు తదితరులు పాల్గొన్నారు.

తూనికలు, కొలతలు సరిగా లేకపోతే చర్యలు

– లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ రమేష్ కుమార్ రెడ్డి

నిమ్మనపల్లె : వ్యాపారులు తూనికలు కొలతలను ప్రభుత్వం నిర్దేశించిన విధంగా పాటించకపోతే చర్యలు తప్పవని జిల్లా లీగల్ మెట్రాలజీ ఇన్స్‌పెక్టర్ రమేష్ కుమార్ రెడ్డి అన్నారు. గురువారం నిమ్మనపల్లెలో అన్ని రకాల దుకాణాలలో తూనికలు కొలతలను, వస్తువుల ప్యాకింగ్‌లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలక్ట్రానిక్ తూనికల యంత్రాలు, మెకానికల్ తూనికల యంత్రాలు తనిఖీ చేశామన్నారు. వ్యవసాయ అనుబంధ దుకాణాలను, పలు బేకరీలలో, ఇతర దుకాణాలలో తనిఖీలు చేసి యంత్రాలను పరిశీలించామన్నారు. బేకరీలలో వస్తువుల ప్యాకింగ్ లలో ప్రభుత్వం నిర్దేశించిన విధంగా వస్తు తయారీ, మన్నిక కాలం, కొలతలు, వస్తుతయారీ వివరాలు లేవని, తూనికల్లో కొంతమేర వ్యత్యాసం ఉందన్నారు. మొదటి తప్పుగా భావించి సరిదిద్దుకోవాలని దుకాణ యజమానులను హెచ్చరించినట్లు చెప్పారు. మరోసారి తప్పిదాలకు పాల్పడితే భారీ జరిమానాలను విధిస్తామన్నారు. కార్యక్రమంలో లీగల్ మెట్రాలజీ అధికారులు పాల్గొన్నారు.

రథోత్సవంలో సేవా కార్యక్రమాలు



భక్తులకు అన్నదానం చేస్తున్న పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

వాల్మీకిపురం : రథోత్సవం సందర్భంగా భక్తుల కోసం మండలంలోని పలువురు పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. గురువారం స్థానిక బజారువీధికి చెందిన కువైట్ శంకరాచారి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి పాల్గొని, భక్తులకు అన్నదానం చేశారు. అలాగే మాజీ సైనికుడు టి. లక్ష్మీనారాయణ శెట్టి శ్రీవాస వీకళ్యాణమండపంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అలాగే శ్రీసాయినాథ డ్రైవర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డ్రైవర్లు స్థానిక గాంధీబస్టాండ్‌లో అన్నదానం, వాటర్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. అలాగే పట్టణానికి చెందిన రామిశెట్టి సునీల్ ఆధ్వర్యంలో భక్తులకు రస్నా, మజ్జిగ అందించారు. సహార ట్రస్ట్ ఆధ్వర్యంలో భక్తులకు మజ్జిగ, వాటర్ ప్యాకెట్లు, రస్నా, స్థానిక తిరుచుట్టివీధిలో శ్రీధర్‌రాయల్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ప్రభుత్వాస్పత్రిలో సురక్షిత ప్రసవం

– డీఎంహెచ్‌వో డాక్టర్ కొండయ్య



రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ

పీలేరు రూరల్ : ప్రభుత్వాస్పత్రుల్లోనే సురక్షిత ప్రసవం సాధ్యమని డీఎంహెచ్‌వో డాక్టర్ కొండయ్య అన్నారు. గురువారం మండలంలోని రేగళ్లు, తలపుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను అకస్మికంగా తనిఖీ చేశారు. పీహెచ్‌సీలో కాన్పులు అయిన బాలింతలకు సూచినలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీహెచ్‌సీలలో నెలకు కనీసం 5 కాన్పులు చేయాలని సూచించారు. గర్భిణుల అన్ని రకాల సేవలు అందించి తల్లి బిడ్డల ఆరోగ్యంకు దోహదపడాలన్నారు. వేసవిలో వడదెబ్బ పట్ల ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. డాక్టర్ రమేష్‌రెడ్డి, డాక్టర్ చంద్రశేఖర్‌నాయక్, సీహెచ్‌వో జయలక్ష్మీ, సూపర్‌వైజర్ రమాదేవి, కృష్ణయ్య, చిన్నప్ప, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమ సారథి జగనన్నకు పట్టం కడదాం



ఎన్నికల ప్రచారంలో పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి

పీలేరు : సంక్షేమ సారథి రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డికి మరోసారి పట్టం కట్టాలని పీలేరు, కేవీపల్లె మండలాల పార్టీ ఎన్నికల ఇన్‌చార్జి పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి అన్నారు. గురువారం బోడుమల్లువారిపల్లె పంచాయతీ వినాయకనగర్, మేకలవానికాల్వ, మొరవపడ్డి, బోడుమల్లువారిపల్లె, హరిజనవాడ, గదకుంటపల్లె తదితర గ్రామాల్లోపర్యటించి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాల్లో వైఎస్సార్‌సీపీ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు చూసి వైఎస్సార్‌సీపీని గెలిపించాలని కోరారు. పీలేరులో మరింత అభివృద్ధిని కాంక్షిస్తూ రాజంపేట ఎంపీగా పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డిని, ఎమ్మెల్యేగా చింతల రామచంద్రారెడ్డిని మరోసారి గెలిపించి హ్యాట్రిక్ విజయాన్ని అందించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ బి.సి. జయలక్ష్మీదేవి, నాయకులు బి.సి. అమరనాథరెడ్డి, బి.సి. జ్ఞానశేఖర్‌రెడ్డి, ఎం. రవీంద్రనాథరెడ్డి, ఎం. సురేంద్రనాథరెడ్డి, న్యాయవాది పురుషోత్తంరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, సతీష్‌కుమార్‌రెడ్డి, వెంకటరమణ, శీను, కడప గిరిధర్‌రెడ్డి, చక్రధర్, సునీల్‌రెడ్డి, సాంబశివరెడ్డి, అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నామినేషన్ల పర్వం ప్రారంభం

తొలిరోజు సింగిల్ నామినేషన్ దాఖలు

మదనపల్లె : సార్వత్రిక ఎన్నికల పోరులో తొలి ఘట్టం ప్రారంభమైంది. నామినేషన్ల పర్వానికి తెర లేచింది. మొదటిరోజు గురువారం 164–మదనపల్లె అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి ఒకే ఒక నామినేషన్ దాఖలైంది. సబ్ కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన నామినేషన్ల స్వీకరణ కేంద్రంలో టీడీపీ అభ్యర్థి షాజహాన్‌బాషా నామినేషన్ పత్రాలు రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ హరిప్రసాద్‌కు సమర్పించారు. ఉదయం 11 గంటలకు నామినేషన్ల స్వీకరణకు నోటిఫికేషన్ వెలువడినప్పటి నుంచి ఎన్నికల అధికారులు నామినేషన్ల స్వీకరణకు సిద్ధంగా ఉన్నారు. నామినేషన్ల స్వీకరణలో ఏఆర్వోలు తహసీల్దార్ రమాదేవి, బాలాజీరాజు, శ్రీనివాసులు, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

పటిష్ట బందోబస్తు...

నామినేషన్ల స్వీకరణ సందర్భంగా ఆర్వో కార్యాలయం వద్ద పోలీసులు, ఎన్నికల అధికారులు పటిష్ట బందోబస్తు ఏర్పాటుచేశారు. ఆర్వో కార్యాలయం మదనపల్లె–చిత్తూరు ప్రధానరహదారిపై ఉండటంతో ఉదయం 10.30 గంటల నుంచే పోలీసులు ట్రాఫిక్‌ను మళ్లించారు. సబ్ కలెక్టరేట్‌కు 200 మీటర్ల దూరంలోపే వాహనాలను రానివ్వకుండా బ్యారికేడ్లు ఏర్పాటుచేశారు. నామినేషన్ దాఖలు చేసేందుకు వచ్చిన వాహనాలను 100 మీటర్లకు అవతల నిలుపుదల చేయించారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఎన్నికల సిబ్బందిని, నామినేషన్ వేసేందుకు వచ్చిన వారిని తప్ప మిగిలిన వారిని అనుమతించలేదు. డీఎస్పీ ప్రసాదరెడ్డి ఆధ్వర్యంలో సీఐలు వలీబాషు, యువరాజు, ఎస్.శేఖర్‌లు ఆర్వో కార్యాలయం వద్ద విధులు నిర్వహించారు.

వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించండి



కొత్తపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న డాక్టర్ ఇక్బాల్ అహ్మద్

కలికిరి : పీలేరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి చింతల రామచంద్రారెడ్డి, రాజంపేట పార్లమెంటు సభ్యులు పీవీ మిథున్ రెడ్డిలను అఖండ మెజారిటీతో గెలిపించాలని రాష్ట్ర మైనారిటీ కమిషన్ చైర్మన్ డాక్టర్ ఇక్బాల్ అహ్మద్‌కోరారు. మండలంలోని అద్దవారిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని కొత్తపల్లి, అద్దవారిపల్లి గ్రామాల్లో ఆయన గడప గడపకు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు సుభిక్షంగా ఉండాలంటే మళ్లీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే గెలవాలన్నారు. ప్రతిపక్ష కూటమికి ఓటు వేస్తే మళ్లీ జన్మభూమి కమిటీలు ఏర్పాటై ప్రజలను దోచుకుంటారన్నారు. కూటమితో అవినీతి రాజ్యమేలుతుంది తప్ప ప్రజలకు ఏలాంటి మంచి జరుగదన్నారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ నల్లారి తిమ్మారెడ్డి, సర్పంచ్‌లు గంగయ్య, తస్లీమారియాజ్, మండల కో–ఆప్షన్ సభ్యుడు రిజ్వానుల్లా, ప్రదీప్‌కుమార్‌రెడ్డి, మల్లికార్జున, జహీద్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

నామినేషన్‌కు తరలిన నాయకులు

పెద్దతిప్పసముద్రం : తంబళ్ళపల్లిలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి గురువారం వేసే నామినేషన్‌కు మండలం నుంచి అధిక సంఖ్యలో ప్రజలు తరలి వెళ్ళారు. వైఎస్సాసీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు వందలాది వాహనాల్లో వేలాది మందితో ఉత్సాహంతో నామినేషన్‌కు వెళ్ళారు. జై జగన్, పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి నాయకత్వం వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేశారు.

కనుల పండువగా సీతారాముల కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మదనపల్లె సిటీ : స్థానిక సొసైటీ కాలనీలోని రామాలయంలో గురువారం స్వామి కల్యాణోత్సవం కనుల పండువగా జరిగింది. ఆలయ ప్రాంగణంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కల్యాణ వేదికలో సీతారాముల కల్యాణాన్ని వేదపండితులు శాస్త్రోకంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో హోమం, పంచామృతాభిషేకం చేశారు. కల్యాణం తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమంలో రామాలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మిట్స్‌లో జాతీయ స్పోర్ట్స్ ఫెస్ట్

కురబలకోట : అంగళ్లులోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో ఈనెల 25, 26న జరిగే అశ్వ–24 కార్యక్రమంలో భాగంగా జాతీయ స్థాయిలో స్పోర్ట్స్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ యువరాజ్ తెలిపారు. గురువారం ఆటల పోటీలను ప్రారంభించారు. జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్న ఈ పోటీల్లో క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఇతర పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వివిధ ప్రాంతాల విద్యార్థులు ఇక్కడకు రావడంతో కళాశాలతో పాటు అంగళ్లు సందడిగా మారింది.

అగ్నిప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

మదనపల్లె సిటీ : వేసవిలో అగ్నిప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా అగ్నిమాపక అధికారి పి.అనిల్‌కుమార్ అన్నారు. గురువారం అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా స్థానిక చిత్తూరు రోడ్డులోని జవహర్ నవోదయ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఎల్పీజీ గ్యాస్ సిలిండర్ లీక్ అయినప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రెస్క్యూ ఆపరేటర్స్, ఎక్సటింగ్విషర్,స్విమ్మింగ్‌కి సంబంధించిన లైఫ్‌బాయ్, లైఫ్ జాకెట్ వంటి పరికరాలు గురించి వివరించారు. ఎటువంటి అగ్నిప్రమాదాలకైన వెంటనే 101, 08571–222101కు ఫోన్ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో అగ్నిమాపక అధికారి శివప్ప, జవహర్ నవోదయ విద్యాలయ ప్రిన్సిపల్ గోవిందరావు, వైస్ ప్రిన్సిపాల్ వేలాయుధన్, అగ్నిమాపక సిబ్బంది విజయ్‌కుమార్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పెద్దిరెడ్డి, ఎంపీ పర్యటనను విజయవంతం చేయండి

కలికిరి : ఈ నెల 22న కలికిరిలో రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, పార్లమెంటు సభ్యులు పీవీ మిథున్ రెడ్డి పర్యటనను విజయవంతం చేయాలని ఏపీఎండీసీ డైరెక్టర్ సి.హరీష్ రెడ్డి కోరారు. కలికిరి మండల కేంద్రంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు త్వరలో ప్రారంభానికి ఏర్పాటు చేసిన వైఎస్సార్‌సీపీ కార్యాలయాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన కార్యకర్తలనుద్దేశించి మాట్లాడుతూ ప్రతి నాయకుడు, కార్యకర్త ఎన్నికలలో సైనికునిలా పని చేయాలని, కష్టపడి పని చేసిన వారికి తగిన గుర్తింపు ఇవ్వడం జరుగుతుందని ఆయన తెలిపారు. అలాగే ఈ నెల 25న పీలేరులో జరుగు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి నామినేషన్ కార్యక్రమానికి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ ఇక్బాల్ నాయకులు రమేష్‌కుమార్‌రెడ్డి, రత్నశేఖర్‌రెడ్డి, రాహుల్‌చక్రవర్తిరెడ్డి, హనీఫ్, మధుసూదన్‌రెడ్డి, ఎస్‌పీఎస్ అల్తాఫ్, రెడ్డెప్ప, రఘు, మదన్‌మోహన్‌రెడ్డి, ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.

21న మంత్రి పెద్దిరెడ్డి ఎన్నికల సభ

రామసముద్రం : ఈనెల 21న ఆదివారం జరిగే మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సభను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దేశాయి తిప్పారెడ్డి తెలిపారు. గురువారం రాత్రి ఆయన రామసముద్రంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివారం ఉదయం ఎనిమిది గంటలకు మినికి గ్రామం నుంచి బైక్ ర్యాలీగా రామసముద్రం చేరుకొని 9గంటలకు రామసముద్రం అంబేద్కర్ సర్కిల్లో ఎన్నికల సభ నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమానికి అధిక సంఖ్యలో మండలంలోని కార్యకర్తలు, నాయకులు, అభిమానులు, హాజరై సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రామచంద్రారెడ్డి నాయకులు భాస్కర్ గౌడ్, ఉదయ్, గెవన్న, కృష్ణప్ప, శివ, ఆదినారాయణ, రెడ్డిశేఖర్, ప్రకాష్, మహబూబ్ బాషా, తపాలా మస్తాన్, తదితరులు పాల్గొన్నారు.

నేడు కలికిరిలో ఇంటింటా ప్రచారం

కలికిరి : మండలంలోని పల్లవోలు గ్రామంలో పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ఇంటింటా ఎన్నికల ప్రచారంలో పాల్గొననున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రమేష్ కుమార్ రెడ్డి తెలిపారు. ఉదయం 6.30 గంటల నుంచి పల్లవోలు కస్బా, పడమటపల్లి, సాయంత్రం 5.30 గంటల నుంచి పారప్పగారిపల్లి, తూర్పుపల్లి, ద్వారకానగరం గ్రామాల్లో ఎమ్మెల్యే ప్రచారం నిర్వహిస్తారన్నారు. అలాగే ఎమ్మెల్యే సోదరుడు మాజీ జెడ్పీటీసీ సభ్యుడు చింతల శివానందరెడ్డి గుండ్లూరులో సాయంత్రం 5 గంటల నుంచి గడప గడపకు ప్రచారం పాల్గొననున్నట్లు తెలిపారు. మండలంలోని వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరై కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

మూకుమ్మడిగా గ్రామ వలంటీర్లు రాజీనామా



పీలేరు: రాజీనామా చేసిన గ్రామ వలంటీర్లు



నిమ్మనపల్లె: ఎంపీడీఓకు రాజీనామా పత్రాలు



గుర్రంకొండ : రాజీనామా చేసిన వలంటీర్లు

పీలేరు రూరల్ : మండలంలో 30 మంది గ్రామ వలంటీర్లు రాజీనామా చేసినట్లు సర్పంచ్ జీనత్‌షఫీ తెలిపారు. గురువారం పీలేరు 1వ గ్రామ సచివాలయం పరిధిలోని వలంటీర్లు రాజీనామ పత్రాలను పంచాయతీ కార్యదర్శికి అందజేసినట్లు తెలిపారు. సందర్భంగా గ్రామ వలంటీర్లు మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతుగా నిలవడానికే తాము రాజీనామా చేసినట్లు తెలిపారు.

నిమ్మనపల్లెలో..

నిమ్మనపల్లె : మండలంలోని 24 మంది గ్రామ వలంటీర్లు రాజీనామా చేశారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో రెడ్డివారిపల్లె –5, రాచవేటి వారి పల్లె –14, తవళం –5, మొత్తంగా 24 మంది గ్రామ వాలంటీర్లు ఎంపీడీవో షాలేట్ ను కలసి తమ రాజీనామా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వలంటరీ వ్యవస్థను తీసుకువచ్చిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పరిపాలనలో గత ఐదు సంవత్సరాలుగా ప్రజలకు అనేక విధాలుగా సాయపడుతూ, ప్రభుత్వ సంక్షేమ పథకాలను నేరుగా లబ్దిదారులకు నిష్పక్షపాతంగా అందించామన్నారు. ప్రస్తుతం ఎన్నికల నియమావళిని అడ్డుపెట్టుకుని ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు తమను ప్రజాసేవకు దూరం చేశారన్నారు. చంద్రబాబు వైఖరిని నిరసిస్తూ రాజీనామాలు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మారెప్ప, వెంకటరమణారెడ్డి, వలంటీర్లు పాల్గొన్నారు.

గుర్రంకొండలో..

గుర్రంకొండ : వలంటీర్లపై టీడీపీ నాయకులు వ్యవహరిస్తున్న తీరును నిరసిస్తూ మండలంలోని నడిమికండ్రిగ, చెర్లోపల్లె, సరిమడుగు, టి.పసలవాండ్లపల్లె గ్రామాలకు చెందిన 76 మంది వలంటీర్లు మూకుమ్మడిగా రాజీనామాలు ఇచ్చారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయానికి చేరుకొన్న వలంటీర్లు తమ రాజీనామ పత్రాలను ఒకొక్కరుగా ఎంపీడీఓ జగదీశ్వర్‌రెడ్డికి సమర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ నిస్వార్థంగా ప్రజలకు సేవలందిస్తున్న తమపై టీడీపీ నాయకులు లేనిపోని విమర్శలు చేయడం బాధాకరమన్నారు.

వలంటీర్లు రాజీనామా

మదనపల్లె సిటీ : మదనపల్లె మండలం వేంపల్లి పంచాయతీ పరిధిలో 11 మంది వలంటీర్లు గురువారం రాజీనామా చేశారు. రాజీనామా చేసిన వారిలో డి.జమాల్‌వలి, కె.చందు, సి.చిన్నబాబు, రెడ్డిబిందు, రెడ్డి భార్గవి, ఎన్.విజయలక్ష్మి, గౌతమి, బిందుశ్రీ, చంద్రకళ, కె.కౌసల్య, రమేష్‌నాయక్‌లు పంచాయతీ కార్యదర్శికి రాజీనామా లేఖలను అందజేశారు.

వలంటీర్లు రాజీనామా

కలికిరి : మండలంలో వలంటీర్ల రాజీనామాలు వరుసగా కొనసాగుతున్నాయి. కలికిరి –3 సచివాలయం పరిధిలో ఆరుగురు, కలికిరి–2 సచివాలయం పరిధిలో ఐదురుగు, మునెళ్ళపల్లి సచివాలయంలో విధులు నిర్వహిస్తున్న ఏడుగురు వలంటీర్లు, మొత్తం 18 మంది వలంటీర్లు రాజీనామా పత్రాలను ఆయా గ్రామ సచివాలయ కార్యదర్శికి అందజేశారు. సీఎం జగన్ గెలుపు కోసం కృషి చేస్తామని పేర్కొన్నారు.

సీఎం జగన్‌తోనే అభివృద్ధి, సంక్షేమం

- 3వవార్డు ప్రచారంలో ఎమ్మెల్యే అభ్యర్థి నిసార్‌అహ్మద్
- భర్తను గెలిపించాలని కోరుతూ భార్య, కుమారుడి ఇంటింటి ప్రచారం



3వవార్డులో ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి నిసార్‌అహ్మద్, ఏపీఎండీసీ చైర్‌పర్సన్ షమీంఅస్లాం



12వవార్డులో మున్సిపల్ వైస్‌చైర్మన్ జింకాచలపతి..

మదనపల్లె : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి, ప్రజాసంక్షేమం సాధ్యమని ఎమ్మెల్యే అభ్యర్థి నిసార్‌అహ్మద్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం పట్టణంలోని 3వవార్డులో మాజీ ఎమ్మెల్సీ నరేష్‌కుమార్‌రెడ్డి, ఏపీఎండీసీ చైర్‌పర్సన్ షమీంఅస్లాం, కౌన్సిలర్ భానుప్రకాష్‌తో కలిసి ఇంటింటికీ వెళ్లారు. ఐదేళ్ల వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రజలకు జగనన్న చేసిన మంచిని వివరించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పార్టీలకు అతీతంగా అర్హులందరికీ పథకాలు అందాయని, వివక్ష లేకుండా అభివృద్ధి చేశామన్నారు. సంక్షేమం, అభివృద్ధిని కొనసాగించేందుకు మరోమారు జగన్‌మోహన్‌రెడ్డికి సీఎంగా అవకాశం కల్పించాలన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో విద్య, వైద్య రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారన్నారు. పేదపిల్లలు కూడా ఇంగ్లీష్ మీడియం విద్యను అభ్యసించాలనే ఉద్దేశంతో ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియం ప్రవేశపెట్టారన్నారు. వలంటీర్, సచివాలయ వ్యవస్థతో ప్రభుత్వ పాలనను ప్రజల వద్దకు తీసుకువచ్చిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. అన్ని ప్రాంతాలు, అన్నివర్గాల ప్రజలు బాగుండాలంటే మళ్లీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే అధికారంలోకి రావాలన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి, సీఎం జగనన్న ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చారని, ఆయనకు మనమంతా అండగా నిలవాల్సిన సమయం వచ్చిందన్నారు. రానున్న ఎన్నికల్లోనూ మళ్లీ ఫ్యాన్‌గుర్తుకే ఓటువేసి వైఎస్సార్ సీపీని గెలిపించాలని కోరారు. ఎన్నికల వేళ మాయమాటలను చెప్పే టీడీపీ కూటమి నేతలను నమ్మవద్దన్నారు. మే 13వ తేదీన జరిగే ఎన్నికల్లో రాజంపేట ఎంపీ అభ్యర్థి పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డికి, ఎమ్మెల్యే అభ్యర్థి నిసార్‌అహ్మద్‌కు ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్‌లు ఎస్వీ.రమణ, ఎం.వి.రమణ, వైఎస్సార్ సీపీ నాయకులు శీలంరమేష్, దండురామాంజులు, చరణ్, ఆర్టీపీ నూర్, జేసీఎస్ కన్వీనర్ మునిశేఖర్, బావాజీ, సర్పంచ్ మధు తదితరులు పాల్గొన్నారు.

భర్త గెలుపునకు భార్య, కుమారుడి ప్రచారం

వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నిసార్‌అహ్మద్ గెలుపుకోసం ఆయన భార్య షేక్ తస్నీమ్, కుమారుడు షేక్‌ఆబిద్‌లు పట్టణంలోని 4, 20వవార్డులో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ తరపున పోటీలో ఉన్న ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు ఇద్దరినీ గెలిపించాలని కరపత్రాలు పంచుతూ, ప్రజలకు విజ్ఞప్తి చేశారు. 12వవార్డులో మున్సిపల్ వైస్‌చైర్మన్ జింకాచలపతి ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్ సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపించాల్సిందిగా ప్రజలను విజ్ఞప్తి చేశారు.

నేడు ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవం

రామసముద్రం : మండల కేంద్రంలోని ప్రాథమిక ఉన్నత పాఠశాల 92వ వార్షికోత్సవాన్ని శుక్రవారం స్థానిక టీటీడీ కళ్యాణ మండపంలో నిర్వహించనున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు హేమలత ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు సరస్వతిపూజతో ప్రారంభమై, విద్యార్థిని, విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొనాలని కోరారు.